# తెలుగు కళా సమితి - సంగీత కార్యక్రమాలు

- ప్రభ రఘునాథన్

తెలుగు కళా సమితి ౨౫ సంవత్సరాలు నిండి త్వరలోనే పుట్టినరోజు చేసుకుంటుందని ఎంతో ఆశ్చర్యంగానూ, ఆనందంగానూ ఉంది. నలభైసంవత్సరాల క్రితం అమెరికా వలస వచ్చిన మన తెలుగువారిలో కొందరు మహానుభావులు ౧౯౮౪ వ సంవత్సరంలో నాటిన చిన్నమొక్క, పెద్దవృక్షమై "ఇంతింతైవటుడింతై" అన్నట్లుగా అతి త్వరితంగా పెరిగి ౮౦౦ మంది సభ్యులతో కళకళ లాడుతుండటం చూస్తే సమితి అభ్యుదయానికి నీరు పోసి పాటుపడి, కృషిచేసిన మన అధ్యక్షులు, కార్యదర్శులు, తదితర కార్యవర్గ సభ్యుల యొక్క శ్రమ ఫలించినట్లు తెలుస్తూనేవుంది.

తెలుగు కళాసమితి ౨౫ సంవత్సరాలుగా ఎన్నో రకాల కార్యక్రమాల్ని చేపట్టి ప్రేక్షకులని అలరిస్తూఉంది. అందులో సంగీత కార్యక్రమాలు కూడా చెప్పుకోదగినవే! సమితి ప్రారంభదశలో స్థానిక కళాకారులైన సీమంతిని కౌతా మొదలైనవారి పర్యవేక్షణలో, మన సంఘసభ్యులు, శ్రేయోభిలాషులైన లక్ష్మీనారయణ తంగిరాల, శంకర్రావు పోలేపల్లి, కె.వి.ఆర్. చారి, గిరిజ కొల్లూరి, కల్పకం రావు, నిర్మల కొచ్చెర్లకోట మొదలైనవారితో దీపావళి, ఉగాది కార్యక్రమాల్లో లలిత సంగీతం, అన్నమాచర్య కీర్తనలు - ఎన్నో రూపొందించి, పాడి, ప్రేక్షకుల మన్ననలందు కోవడం జరిగింది.

డా. కె.వి.రావు, జ్యోతి రావుగార్ల పురస్కారం అందుకున్న ప్రఖ్యాత సంగీత విద్వాంసులు మాండొలిన్ శ్రీనివాస్, ద్వారం మంగతాయారుగార్ల బృందం కళాసమితి తరపున వచ్చి మన వేదిక మీద మాత్రమే కాకుండా, మిగిలిన రాష్ట్రాలు కూడా పర్యటించి వారి సంగీతజ్ఞా నంతో ప్రేక్షకులని అన్నిచోట్ల ముగ్ధుల్నిచేసి కళాసమితి గర్వపడేటట్లు చేశారు. ఇదే విధంగా శ్రీ నూకల చినసత్యనారాయణ, వేదవతి ప్రభాకర్, జి.వి. ప్రభాకర్, పి. సుశీల, వాణి జయరాం, ఎస్.పి. బాల సుబ్రహ్మణ్యం, మల్లాది బ్రదర్స్, నేదునూరి కృష్ణమూర్తి గారు మనల్ని వారి సంగీత ఝురిలో ఓలలాడించారంటే దానికి కారణం మన కళాసమితే! పైన ఉదహరించినవి మచ్చుకు కొన్ని మాత్రమే!

దీపావళి ౨౦౦౮ కార్యక్రమానికి ముందు, మొట్టమొదటిసారిగా పెద్ద యెత్తున మన కార్యవర్గ సభ్యురాలైన మంజు భార్గవగారు నిర్వహించిన కర్ణాటక, లలిత సంగీత పోటీలలో, పిన్నలు, పెద్దలు ఎంతోమంది పాల్గొని కార్యక్రమానికి సుమారుగా ౨౦౦ మంది హాజరు కావడం నిజంగా హర్షించదగ్గ విషయం.

తెలుగు కళాసమితి చేపట్టిన వాటిల్లో ౨౫ సంవత్సరాల నుండి నిర్విఘ్నంగా కొనసాగుతున్న మరొక కార్యక్రమం ప్రతి యేటా మార్చిలో జరిగే త్రిమూర్తి ఆరాధనోత్సవం. ప్రారంభించినపుడు మన సమితి మాత్రమే నిర్వహించే ఈ ఉత్సవం, తెలుగు కల్చరల్ సెంటర్, బ్రిడ్జివాటర్ వెంకటేశ్వర ఆలయం, సి.మా.న. వంటి సంఘాలని ఒక్కొక్కటీ కలుపుకొంటూ, ఇప్పుడు వారందరి సహకారంతో, ఘనంగా రోజంతా జరుపుతూ ప్రతి యేడాది సుమారు ౬౦౦ మందిని ఆకర్షిస్తూంది. న్యూజర్సీ సంగీత విద్యార్థులు, కళాకారులే కాకుండా, చుట్టు ప్రక్కల రాష్ట్రాలవారు కూడా ఇందులో పాల్గొంటున్నారు. ఈ ఉత్సవంలో సుమారుగా ౧౮౦ మంది వేదిక నలంకరించి పాడటం చూడటానికి కన్నుల విందుగా అనిపిస్తుంది. ఈ కార్యక్రమానికి ప్రతి యేటా ఇద్దరు, ముగ్గురు కళాకారులని ఆహ్వానించి, వారికి అవకాశమిచ్చి, గౌరవించడం జరుగుతోంది.

తెలుగు కళాసమితి ఇంతవరకు వివిధ రంగాలలో నిష్ణాతులైన కళాకారులను ప్రోత్సహిస్తూ క్రొత్తగా వస్తున్న కుటుంబాలను ఆకట్టుకొంటూ ౨౫ సంవత్సరాలు ఠీవిగా నిలిచింది. ఇలాగే కళాసమితి తన జ్యోతి వన్నె తరగ కుండా మన సభ్యులని కళలని గుర్తించి, వారిని ప్రోత్సహించి, మనతరానికే కాకుండా భావితరాల వారికి కూడా మన సంస్కృతిని, తెలుగుదనాన్ని చాటి చెబుతూ మరింత ఠీవితో ముందుకు సాగుతుందని ఆశిద్దాం!

మొదటినుంచి ప్రతి సంవత్సరం ఆడియో మొదలైన పనులతో మన సంగీత త్రయ దినోత్సవానికి తోడ్పడే తాడేపల్లి దాసుగారికి కృతజ్ఞతలు

(ప్రభ రఘునాథ్, కిడాంబి రఘునాథ్‌ల పర్యవేక్షణలో మొదలయిన 'సంగీతమూర్తిత్రయ ఆరాధనోత్సవము' మాత్రమే కాక, ౧౯౮౪-౨౦౦౩ వరకు మన కళా సమితి సంగీత కార్యక్రమాలు ఎన్నో వీరి సహాయ సహకారాలతో జయప్రదమయ్యాయి.

--మూర్తి భావరాజు)